క్లుప్తంగా

పెదకాకానిలో స్వామిత్వపై క్షేత్రస్థాయి సర్వే



పెదకాకాని: స్వామిత్వ ప్రక్రియపై పెదకాకాని క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు డిఎల్‌పీఓ శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని గ్రామాన్ని గత కొంతకాలం క్రితం డోన్‌తో సర్వే నిర్వహించి చాయా చిత్రాన్ని రూపొందించారు. ఈ విధానం ద్వారా గ్రామంలో ఉన్న ఇల్లు, ఇళ్ళ స్థలాల పొడవు, వెడల్పులతో విస్తీర్ణం కూడా అంచనా వేయడం జరిగింది. డోన్ సర్వే పరిశీలనలో బాగంగా మంగళవారం పెదకాకాని గ్రామంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. స్వామిత్ర ప్రోగ్రాం ద్వారా డోన్ సర్వే, ప్రస్తుతం నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి స్థాయి సర్వేకి వ్యత్యాసం ఏమీ లేదని, కొలతలు ఒకే విధంగా ఉన్నాయని డిఎల్‌పీఓ తెలియజేశారు. ఈ క్షేత్ర స్థాయి సర్వేలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలకు అటానమస్ హోదా

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి 2030 వరకు అటానమస్ గుర్తింపు కలిగిన కళాశాలగా కొనసాగేందుకు న్యూఢిల్లీలోని యూజీసీ అనుమతించినట్లు చెప్పారు. ఈసందర్భంగా కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు పోలిశెట్టి శ్యాం సుందర్, కేవీ బ్రహ్మం, కమిటీ సభ్యులు అటానమస్ గుర్తింపు దిశగా కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 26 నుంచి 90 రోజుల లోపు (అక్టోబర్ 24లోపు) ఆన్‌లైన్‌లో http://rrdtcp.ap.go-v.in/ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



గుంటూరు ఎడ్యుకేషన్: తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే మంచి పిల్లలుగా విద్యార్థులు ఎదగాలని మోటివేషనల్ స్పీకర్ సీహెచ్ వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంతో పాటు కెరీర్ మార్గదర్శకాలపై సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్ మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు గర్వకారణం కావాలన్నారు. విద్యార్థి దశ నుంచే అహర్నిశలూ కృషి చేస్తూ, తమలోని సృజనాత్మక నైపుణ్యాలను పదును పెట్టాలని సూచించారు. సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో అనంతమైన శక్తి దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రతిభకు మెరుగులు దిద్దుకోవాలని సూచించారు. యువజన సర్వీసుల శాఖ గుంటూరు మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలు, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి పర్చేందుకు విద్యాసంస్థల్లో యువతకు అవగాహన కల్పించేందుకు సైకాలజిస్టులు, మోటివేషనల్ స్పీకర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో మానవత సంస్థ ప్రతినిధులు సాంబశివరావు, విజయ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, అధ్యాపకులు ధాత్రికుమారి, కె.సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళన

గుంటూరు ఎడ్యుకేషన్: దుగ్గిరాల మండలంలో ఉప ఖజానాధికారి(ఎస్టీవో) వైఖరి కారణంగా ఉపాధ్యాయులకు నిలిచిన వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానాధికారి కార్యాలయంలో డీటీఓకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ఇటీవల బదిలీల ప్రక్రియలో భాగంగా స్థాన చలనం పొందిన ఉపాధ్యాయులకు జూన్‌కు సంబంధించిన వేతనాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీవోలందరూ చెల్లింపులు జరిపారని తెలిపారు. అయితే దుగ్గిరాల మండలంలో బదిలీలు కాని ఉపాధ్యాయులను బదిలీల సమాచారం అందలేదనే సాకుతో అక్కడి ఎస్టీఓ వేతనాలు చెల్లించలేదన్నారు. ఇదమేని అడిగితే ఎస్టీఓ కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని డీటీవో దృష్టికి తెచ్చారు. గత 20 ఏళ్లుగా ఉన్న హెచ్ఆర్ఏ వర్తించదని, తక్షణమే నోటీసులను ఉపసంహరించుకోని పక్షంలో దుగ్గిరాల ఉప ఖజానా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

స్వల్పకాలిక వరి రకాలు నాటుకోవాలి

- అంగూర్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ పీవీ సత్యన్నారాయణ సూచన
- వేర్వేరు ప్రాంతాల్లో వరి పొలాల పరిశీలన



వెంకటకృష్ణాపురం శివారులో రైతులతో మాట్లాడుతున్న సత్యన్నారాయణ

పెదకాకాని: అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులు పొలంలోని నీరు బయటకు పోయిన తరువాత స్వల్పకాలిక వరిరకం నారు నాటుకోవాలని అంగూర్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ పీవీ సత్యన్నారాయణ అన్నారు. మండలంలోని నంబూరు, గోళ్ళమూడి, వెంకట కృష్ణాపురం, ఉప్పలపాడు గ్రామాలను మంగళవారం అంగూర్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ పీవీ సత్యన్నారాయణ బృందం సందర్శించారు. నంబూరు సి బ్లాక్‌లోని వరి పొలం మొత్తం ముంపుకు గురై నష్టం జరిగినట్లు గుర్తించారు. మండలంలోని పంట నీటమునిగిన గ్రామాల్లోని పైర్లను రైతులతో కలిసి పొలంలోకి దిగి పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పివి సత్యనారాయణ మాట్లాడుతూ వరద నీరు అధికంగా రావడం వలన ఇప్పటికీ పలు పొలాల్లో నిల్వ ఉందన్నారు. నీరు మొత్తం పోయిన తరువాత స్వల్ప కాలిక రకాలైన వరిని నాటే పద్ధతిలో వేసుకోవాలన్నారు. వరి సాగు సాధ్యపడని పక్షంలో డిసెంబరు నెలలో మినుము కానీ జొన్న కానీ పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి రమణ కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ మోహన్‌రెడ్డి, రామకృష్ణ, డాక్టర్ కృష్ణనాయక్, డాక్టర్ పి.కిషోర్ వర్మ, డాక్టర్ ఎస్.ప్రతిపశ్రీ, డాక్టర్ రాజేష్ చౌదరి, వెంకట కృష్ణాపురం గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల వెంకటేశ్వరరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వరి పంట పొలాల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ పీవీ

పొన్నూరు: మండలంలోని దండమూడి, పచ్చలతాడిపర్రు, నిడుబ్రోలులో నీట మునిగిన వరి చేలను మంగళవారం లాంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం చెందిన డాక్టర్ పీవీ, సత్యనారాయణ, సైంటిస్టు బందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. వెదవరిలో దెబ్బతిన్న పొలాల్లో స్వల్పకాలిక రకాల నారు పలుచగా నాటు కోవాలని సూచించారు. బెంగాల్ నాటు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. నాటిన అనంతరం 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ మొదటి సారి వినియోగించాలన్నారు. పొలాల్లో నీటిని త్వరగా బయటికి పంపాలని తెలిపారు. దెబ్బతిన్న పొలాలను దమ్ము చేసుకుని మొలకెత్తిన విత్తనాలను కూడా వెదజల్లవచ్చని అన్నారు. ఇప్పటి వరకు ఎరువులు వేయని పొలాల్లో పంట దెబ్బతినలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్. డి. మోహనరెడ్డి, డాక్టర్. ఎన్. ప్రతిభాశ్రీ, డాక్టర్, ఆర్.కృష్ణనాయక్, డాక్టర్. కిషోర్ వర్మ, డాక్టర్. రాజేష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి

నిడుబ్రోలులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ. ఆర్ వెంకటేశ్వరరావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఎకరాకు 35 కిలోల యూరియా 15 కిలోల పొటాష్ చల్లడంతో తేమ శాతాన్ని తగ్గించి పంట నష్టాన్ని నివారించవచ్చనన్నారు.
పొటాష్ చల్లడం ద్వారా తెగులు, పురుగులను తట్టుకునే శక్తి లభిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు జమకాని తట్టుకునే శక్తి లభిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు జమకాని వారు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి టి. దివ్యశ్రీ, ఎంపీఈవోలు షేక్. రేష్మా, ఎన్. సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్లలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



పెదకాకాని: శ్రావణమాస పర్వదినం మంగళవారం మండలంలోని వెనిగండ్ల గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ దేవతలకు కొలుపులు కార్యక్రమంలో బాగంగా గ్రామంలో భక్తులు ఉదయం మేళతాళాలతో బొడ్డురాయి సెంటర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారికి, నాంచారమ్మ తల్లికి పొంగలి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరికాయలు, పూజా ద్రవ్యములతో పూజలు చేశారు. సాయంత్రం కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేక ట్రాక్టర్‌పై అలంకరించి గ్రామోత్సవము నిర్వహించారు. నెల్లూరుకు చెందిన చిన్నారుల కోలాటం, శివపార్వతుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తీన్‌మార్ తప్పెట్లు, కనక తప్పెట్ల, విద్యుత్ కాంతులతో కోలాహలంగా గ్రామోత్సవం, అనంతరం గంగానమ్మ ఆలయానికి చేరుకుని పూజా ద్రవ్యములు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక పూజలతో ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. అధికసంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

వరద బాధిత రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెదకాకాని: వరదలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పెదకాకానిలో తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు రైతులతో కలిసి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మండలంలోని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పంటలు వేసిన రైతులు నష్టపోయారని, ముఖ్యంగా వరి పంట ఒకటి రెండుసార్లు సుమారు 20 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వేస్తే అది నీటిపాలైందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి తక్షణమే పంట రుణాలు మంజూరు చేయాలన్నారు.అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తింప జేయాలన్నారు. ఇటీవల అధిక వర్షాలు వరదల్లో నష్టపోయిన పంటకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులు పెంచి రోజుకు 600 కనీస వేతనం ఇవ్వాలన్నారు. గుంటూరు చానల్ కొండవీటి వాగు ఇతర పంట కాలవలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని కోరారు. రైతు సేవ కేంద్రాల్లో విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, అందుబాటులో ఉంచాలన్నారు. పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ స్పందిస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లంగుల శివయ్య, తన్నీరు సాంబశివరావు, చెన్నం మోహన్, పసుపులేటి రఘు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలు బ్లాక్స్ స్పాట్స్ లేకుండా చూడాలి



పొత్తూరులో పర్యటిస్తున్న కమీషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో చెత్త కుప్పలు, బ్లాక్స్ స్పాట్స్ లేకుండా ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులు భాధ్యత తీసుకోవాలని, ప్రజలకు కూడా రోడ్ల మీద వ్యర్థాలు వేయకుండా అవగాహన కలిగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం శ్రీనివాస రావుతోట, సాయి నగర్, పొత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయాల వారీగా పారిశుద్ధ్యంపై అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్ల మీద చెత్త ఉండడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రతి రోజు ఇంటి వద్దకు చెత్త సేకరణకు వచ్చే సమయంపై అవగాహన కల్గించాలన్నారు. రోడ్ల మీద వేసే వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. మధ్యాహ్నం డ్రైన్ కల్వర్టులు శుభ్రం చేయాలన్నారు. యూజీడి మ్యాన్ హోల్స్ దగ్గర ఓవర్ ఫ్లో కాకుండా ఎప్పటికప్పుడు ఏమినిటి కార్యదర్శులు గమనిస్తూ, సమస్యను గుర్తిస్తే యూజీడి వర్కర్స్ ద్వారా పరిష్కారం చేయాలని ఆదేశించారు. వార్డ్‌ల వారీగా అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పాటించని ప్రాంతాల్లో సంబంధిత అధికారులు, కార్యదర్శులే భాధ్యత వహించాలన్నారు. పీజీఆర్ఎస్‌కి పొత్తూరు నుంచి ఇచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సాయినగర్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, నిబంధనల మేరకు నిర్మాణాలు జరిగేలా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు పర్యవేక్షణ చేయాలని, అనధికార, అక్రమ నిర్మాణాలను తొలి దశలోనే అడ్డుకోవాలన్నారు. పర్యటనలో డీఈఈ వెంకట రమణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం



బుద్ధప్రసాద్ చేతుల మీదగా అందుకుంటున్న ఏఎన్‌యూ ఫొటోగ్రాఫర్ సునీల్‌కుమార్

పెదకాకాని (ఏఎన్‌యు) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పాత్రికేయ విద్యా విభాగంలో దశాబ్దానికి పైగా ఫొటోగ్రాఫర్‌గా విధులు నిర్వహిస్తున్న గుత్తా సునీల్ కుమార్‌కు ఉత్తమ ఫొటోగ్రాఫర్ పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ), ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ) వారు ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి ఫొటో ప్రదర్శనలో ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు 2025ను గుత్తా సునీల్ కుమార్ అందుకున్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో జరిగిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం, ప్రపంచ గిరిజన దినోత్సవం వేడుక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రకటించారు. ముఖ్య అతిథి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, పాయ్ వైస్ ప్రసిడెంట్ డాక్టర్ కొంపల్లి సుందర్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ డాక్టర్ గోకరాజు గంగరాజు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సీఈఓ ఆర్ మల్లిఖార్జునరావు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు గొల్ల నారాయణరావు, వెంకటరమణ, ఉపాధ్యక్షులు డాక్టర్ కొంపల్లి సుందర్, వివిధ రాష్ట్రాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య డాక్టర్ కె.జ్యోతిర్మయి, డాక్టర్ జె.మధుబాబు తదితరులు అభినందించారు. వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, తాత్కాలిక రిజిస్ట్రార్ జి.సింహాచలం, దూరవిద్యా కేంద్ర సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు, ప్రశంసించారు.

మట్టి గణపతిని పూజించి కాలుష్యాన్ని నివారించాలి

నూతక్కిలో ప్రజలకు అవగాహన కల్పించిన కేఎల్‌యూ విద్యార్థులు

నూతక్కి(మంగళగిరి): వినాయక చవితికి మట్టి గణపతి ప్రతిమలను పూజించి కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడాలని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని నూతక్కి గ్రామంలో మంగళవారం వర్సిటీ విద్యార్థులు ఇంటింటికీ తిరిగి పర్యావరణాన్ని ఎలా కాపాడాలి, కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మట్టి వినాయకులను పూజించి ఇంటి తోటలో లేదా కుండీలలో నిమజ్జనం చేయడం వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

వర్సిటీలో ఘనంగా సోషల్ వర్క్ దినోత్సవం

పెదకాకాని (ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున వర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో మంగళవారం 6వ జాతీయ సోషల్ వర్క్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య యం త్రిమూర్తిరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. నేషనల్ అసోసియేష్ ఆఫ్ ప్రొఫెషనల్ సోషల్ వర్క్ ఇన్ ఇండియా (ఎన్ఏపీఎస్ఈబ్ల్యుఐ) సహకారంతో ఆగస్ట్ 15 నుంచి 21 వరకు నేషనల్ సోషల్ వర్క్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా బ్రిడ్జింగ్ కేర్ అండ్ కంపోషన్- సోషల్ వర్క్ ఇన్ హెల్త్ సెట్టింగ్స్ అనే ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం సురేష్ కుమార్ మాట్లాడుతూ సోషల్ వర్క్ ప్రాముఖ్యతను తెలియజేశారు. సామాజిక భాధ్యత గల పౌరులను సోషల్ వర్క్ విభాగం తయారు చేస్తుందన్నారు. విభాగం అధ్యాపకులు, సోషల్ సైన్స్ డీన్, సీడీఇ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ఏపీఎస్‌ఈబ్ల్యుఐ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. బీఓఎస్ చైర్మన్, మాజీ పాలక మండలి సభ్యులు ఆచార్య సరస్వతీ రాజు అయ్యర్ మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న మానసిక సమస్యలు, ఇతర రుగ్మతలపై సోషల్ వర్కర్లు కల్పిస్తున్న అవగాహనను వివరించారు. ఆచార్య ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణలో సోషల్ వర్కర్ల బాధ్యత విలువైనదిగా పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అతిధి అధ్యాపకులు డాక్టర్ పి.రాజ్ కుమార్, డాక్టర్ డి.రాజశేఖర్, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ నగరపాలక సంస్థ కో-ఆప్షన్ మెంబర్ పూనూరి నాగేశ్వరరావు తల్లి పూనూరి రాములమ్మ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. సంజీవయ్యనగర్‌లోని డాక్టర్ పినపాటి ప్రభుదాస్ నగరపాలక సంస్థ పాఠశాలలో విశ్రాంతి డెప్యూటీ కలెక్టర్ గొర్రెపాటి అచ్యుత రావు హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అగ్గిపెట్టె రాజు, తు మ్మేటి శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏడీఈ పూనూరి ఆనందరావు, హైస్కూల్ హెచ్ఎం కిషోర్ బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లాడ్జీలో అగ్నిప్రమాదం



నెహ్రూనగర్: అరండల్‌పేట 4వలైనులో ఉన్న ఓ ప్రైవేట్ హోటల్(లాడ్జి)లో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని లాడ్జి నిర్వాహకులు చెప్పారు.

దొంగ ఓట్లతో అధికారంలోకి బీజేపీ

కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం



లక్ష్మీపురం: దేశంలో బీజేపీ ప్రభుత్వం 2024లో దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వలేదని మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం అన్నారు. గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఓట్ చోర్ గద్దీ చోర్ అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్నంబజార్ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి హిమని సెంటర్ మహాత్మా గాంధి విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేశారు. తొలుత గాంధి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బిహార్‌లో 65 లక్షల ఓట్ల ను తొలిగించిన దేశ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఈవీఎంలతో బీజేపీ ప్రభుత్వం మోస పూరితంగా అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

మంచి అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం

- వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు
- ఉచిత పోషకాహార ఆరోగ్య పరీక్షలు కౌన్సెలింగ్



కార్యక్రమాన్ని ప్రారంభించిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని(ఏఎన్‌యూ): మంచి ఆరోగ్యకరమైన అలవాట్ల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్, వ్యాయామ కళాశాల, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు ఉచిత పోషకాహార పరీక్షలు, కౌన్సెలింగ్ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఏఎన్‌యులోని డైక్‌మెన్ ఆడిటోరియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎస్ఆర్ డైరెక్టర్, ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్ హెచ్ఓడీ డాక్టర్ బి.బబిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ పోషక ఆహార లోపాలను అధిగమించాలంటే ముఖ్యమైన విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను ప్రతిరోజు తీసుకోవాలన్నారు. దానితో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందించారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు సమాజహితం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ జలజ కుమారి, సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వెంకట రమణ, వ్యాయామ కళాశాల ఆచార్యులు డాక్టర్ కిషోర్, డాక్టర్ రామ్మోహన్ రావు, వికాస అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది పరీక్షలు చేయించుకున్నారు.

శానిటేషన్‌తోనే గ్రామాల అభివృద్ధి

జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాగ సాయికుమార్



మొక్కలు నాటుతున్న నాగ సాయికుమార్

చేబ్రోలు: పారిశుద్ధ్యం పంచాయతీల ప్రధాన లక్ష్యమని, గ్రామాల అభివృద్ధి సమర్ధవంతమైన శానిటేషన్ తోనే ముడిపడి ఉందని జిల్లా పంచాయతీ అధికారి బి.వెంకట నాగ సాయికుమార్ అన్నారు. ఉమ్మడి ఐదు జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, నూతన ఎంపీడీవోలకు బాపట్ల శిక్షణ కేంద్రంలో కొద్ది రోజులుగా వివిధ అంశాలపై సమగ్ర శిక్షణ అందజేస్తున్నారు. మంగళవారం క్షేత్ర పరిశీలన కోసం వీరందరూ చేబ్రోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్శనలో మండల కేంద్రమైన చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వడ్లమూడి ఎస్‌డబ్ల్యూసీ షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బి.వెంకట నాగ సాయి కుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న ఎంపీడీవోలు పనిని సమర్ధవంతంగా చేయడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం దృక్పథాన్ని పొందడానికి ఈ శిక్షణను ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి ఘన వ్యర్థాల సేకరణ వాటి నిర్వహణ నిరంతర అధ్యయనమన్నారు. సేకరించిన చెత్తను వేరు చేసి, తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను షెడ్డు ద్వారా విక్రయించటం లేదా రీసైకిల్ చేసి సంపద సృష్టించడమే ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్ర లక్ష్యమని వివరించారు. పంచాయతీ సిబ్బంది వీటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రతి పంచాయతీ కార్యదర్శి విధిగా నిర్వహించాల్సిన 10 ప్రశ్నలు వాటి కార్యచరణ వివరాలను డీపీఆర్సీ రీసోర్స్ పర్సన్‌లు అనురాధ, నిరంజన్‌లు వివరించారు. ఉమ్మడి 5 జిల్లాల ఎంపీడీవోలు కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో గుంటూరు ప్రకాశం నెల్లూరు కృష్ణ ఉమ్మడి జిల్లాలలోని ఎంపీడీవోలు, చేబ్రోలు ఇన్‌చార్జి ఎంపీడీవో ఏ ఉమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, చేబ్రోలు, వడ్లమూడి పీఎస్‌లు కె.శ్రీనివాసరావు, చంద్రబోస్ పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 23, 24, 25 తేదీలలో ఒంగోలులో నిర్వహించనున్న మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభల సందర్భంగా ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ప్రతి రోజు ప్రజా సమస్యలను ప్రతిభింబించేలా ఇతివృత్తాలతో కూడిన పాటలు, నృత్యరూపాలు, నాటికలు, నాటకాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటికో మనిషి, శాఖకు ఒక బండి, వెయ్యి డప్పులు, అనే నినాదంతో 23న ఒంగోలు నగర పురవీధులలో భారీ ప్రదర్శనకు తరలిరావాలని కోరారు.
సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివెళ్ళాలని పిలుపునిచ్చా రు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మేడా హనుమంతరావు, చిన్ని తిరుపతయ్య, కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, వుప్పాల సత్యనారాయణ, కాబోతు ఈశ్వరరావు, ముప్పాళ్ల శివశంకర్, షేక్ వలి, రెంటాల కుమారి, యశ్వంత్, చెరుకుమల్లి సింగారావు, రామిశెట్టి ఆదేశ్వరరావు పాల్గొన్నారు.